క్లుప్తంగా

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న కార్మికులు

పుట్టపర్తి టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట అర్ధనగ్నంగా నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సమస్య పరిష్కారం కోసం ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించిక పోవడం దారుణమన్నారు. జీఓ 30 ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలు ఇంజనీరింగ్ కార్మికులకు వర్తింపజేయాలన్నారు. అప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, హెల్త్, రిస్క్ అలివెన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పాఠశాలల సమీపంలో పొగాకు ఉత్పత్తులు అమ్మొద్దు



బుక్కపట్నంలో అంగళ్లను తనిఖీ చేస్తున్న ఎస్ఐ, సిబ్బంది

పుట్టపర్తి: పాఠశాలల పరిసర ప్రాంతాల్లో పొగాకు ఉత్పత్తులు(సిగరెట్లు, బీడీలు, గుట్కాలు) అమ్మొద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తామని బుక్కపట్నం ఎస్ఐ కృష్ణమూర్తి దుకాణదారులను హెచ్చరించారు. సిబ్బందితో కలిసి ఆయన గురువారం బుక్కపట్నంలో బంకులు, అంగళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన దుకాణదారులకు పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై సూచనలు చేశారు.

డ్రై డేతో వ్యాధులు దూరం



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి అరుణ్‌కుమార్

బత్తలపల్లి: గ్రామీణ ప్రజలు తప్పకుండా వారంలో ఒక రోజు డ్రైడే–ఫ్రైడే పాటించడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండొచ్చని బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. డి.చెర్లోపల్లిలో ఇటీవల విషజ్వరాలు కేసులు వెలుగులోకి రావడంతో గురువారం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఫ్రైడే, డ్రైడే కార్యక్రమం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరూ వారానికి కనీసం ఒకసారి నీటి తొట్టెలను, డ్రమ్ములను ఖచ్చితంగా శుభ్రపరిచి ఆరబెట్టాలని సూచించారు. అనంతరం అలాగే ఇంటింటా లార్వా సర్వే, జ్వర సర్వే నిర్వహించారు. డెంగీ, మలేరియా లాంటి వ్యాధుల నివారణకు దోమతెరల వాడకం, వ్యక్తిగత పరిశుభ్రత, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచడం వంటి జాగ్రత్తలు తప్పనిసరి అని ప్రజలకు తెలియజేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు అశ్వర్థనారాయణ, గౌరమ్మ, హెల్త్ ప్రొవైడర్ శ్రీదేవి, ఆరోగ్య కార్యకర్త డేవిడ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత



విద్యార్థికి సర్టిఫికెట్ అందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రశాంతి

ధర్మవరం అర్బన్: రక్త పరీక్ష అవసరాలు, స్వచ్ఛంద సంస్థల పాత్ర అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించినట్లు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి తెలిపారు. పట్టణంలోని గుద్దిటి సోమదాసు వైట్ హౌస్ ప్రాంగణంలో మెహర్ బాబా ప్రేమికుల శాశ్వత వైద్య శిబిరం సేవాసంస్థ ఆధ్వర్యంలో గురువారం ఎంఎల్‌టీ పండుగ అనే పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఎంఎల్‌టీ విద్యార్థులు ప్రతిభ చూపారు. వారికి ప్రిన్సిపాల్ ప్రశాంతి, చేనేత వ్యాపారి గుద్దిటి సోమదాసు, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ హనుమంతప్ప, చేనేత ప్రముఖులు గాలి గంగరాజు, శివయ్య, మెహర్‌బాబా సభ్యురాలు సుజాతమ్మ సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు.

రేపు వాహనాల వేలం

ధర్మవరం అర్బన్: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను శనివారం బహిరంగ వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎస్.చంద్రమణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు బహిరంగ వేలంలో పాల్గొనాలని, వేలం ముగిసిన అనంతరం హెచ్చు పాటదారులకు వాహనాలను అప్పగిస్తామని పేర్కొన్నారు.



బత్తలపల్లిలో ఎండలో కురుస్తున్న వర్షం

ఓ వైపు ఎండ.. మరోవైపు చినుకులు

బత్తలపల్లి: మండల కేంద్రంలో గురువారం విచిత్రమైన సంఘటన చోటు చేసుకుంది. సాయంత్రం 5 గంటల సమయంలో బత్తలపల్లిలో చిన్నపాటిగా వర్షం ప్రారంభమైంది. ఇంతలోనే ఎండ కాస్తోంది. వర్షంలోనే ఎండ కాస్తుండడంతో ప్రజలు ఏమి ఈ విచిత్రం అంటూ ముక్కున వేలేసుకున్నారు. అలా అని వర్షం కూడా ఎక్కువ రాలేదు. ఎండ మాత్రం బాగానే కాసింది. అన్నదాతలు మాత్రం ఆకాశం వైపు చూస్తూ వర్షం ఎప్పుడు కురుస్తుందా అని ఎదురుచూస్తున్నారు.



ఎం.అగ్రహారం గ్రామంలో రోడ్డపై నిలిచిన మురుగునీరు

రోడ్డుపై మురుగు.. నడిచేదెలా?

తాడిమర్రి: ఎం.అగ్రహారం, దాడితోట గ్రామాల్లో రోడ్డుపై నిలిచిన మురుగునీటితో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎం.అగ్రహారంలోని మర్రిమాకులపల్లి గ్రామాలనికి వెళ్లే రహదారి, దాడితోటలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ సమీపంలో గ్రామం చివరిలో రహదారిపై మురుగునీరు చేరింది. గ్రామాల్లో మురుగునీటి కాల్వలు లేక పోవడంతో ఇళ్లలోని నీరు, వర్షపునీరు రోడ్డుపై నిలిచి నీటి కుంటలను తలపిస్తున్నాయి. దీంతో అటు గ్రామస్తులు, ఇటు ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనచోదకులు నీటిలో అదుపు చేయలేక కిందపడి గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారుల్లో మురుగునీరు నిల్వలేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీడీఓ సాయి మనోహర్



బత్తలపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహనాయుడు

ధర్మవరం రూరల్: పంచాయతీల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీడీఓ సాయి మనోహర్ సిబ్బందికి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 2023–24 సంవత్సరానికి సంబంధించి పంచాయతీ అభివృద్ధి సూచికపై సమీక్ష నిర్వహించారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పీఏఐ 2.0 అనేది గ్రామ పంచాయతీల ప్రగతిని 360 డిగ్రీల దృష్టితో అంచనా వేసే ఒక సమగ్ర వ్యవస్థ అన్నారు. ఇందులో ప్రభుత్వ పథకాల అమలులో గ్రామ పంచాయతీల భాగస్వామ్యం, మౌలిక వసతుల అభివృద్ధి, ఆరోగ్యం, విద్య, నీటి సరఫరా, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, డిజిటల్ సేవలు వంటి అనేక అంశాలపై ఆధారపడి స్కోరు ఇచ్చి ప్రగతి కొలవబడుతుందన్నారు. ప్రతి గ్రామాన్ని మెరుగైన ర్యాంకింగ్ వైపు నడిపించాలనే దిశగా ముందుకు సాగుదామని సూచించారు.

బత్తలపల్లి: గ్రామాల అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీడీఓ నరసింహనాయుడు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 'పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 2.0' కార్యక్రమంపై గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ఏఎన్ఎంలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సి పనులు, చర్యలను వివరిస్తూ బుక్‌లెట్‌ను విడుదల చేశారు. అందులో సమగ్ర సమాచారాన్ని పొందుపర్చాలని ఆదేశించారు. పరిపాలన అధికారి శ్రీనివాసులు, మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ పురోగతి సూచికపై మండల స్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శులకు, గ్రామ సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, సిబ్బంది పంచాయితీల వారీగా గ్రామాల్లో అభివృద్ధిపై సమాచారం సేకరించాలన్నారు. గతంలో గ్రామాల సుస్థిర అభివృద్ధి ప్రణాళిక లక్ష్యాలపై ఎంత వరకు పురోగతి సాధించారో నివేదికలను సమర్పించాలన్నారు.

నల్లచెరువు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రఘునాథ గుప్త ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి పంచాయతీ పురోగతిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ రామకృష్ణ, ఎంఈఓ తిరుపాల్ నాయక్, ఏపీఎం రమణప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉట్ల పరుష



ఉట్లమాను పోటీలను తిలకిస్తున్న ప్రజలు



కోడేకండ్లలో కొలువుదీరిన పీర్లు

బత్తలపల్లి: కోడేకండ్ల గ్రామంలో మొహర్రంలో భాగంగా గురువారం ఉట్ల పరుషను ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామంలోని పీర్ల చావిడి ముందు పెద్ద గుంత ఏర్పాటు చేసి అందులో 40 అడుగుల ఉట్లమాను నిలబెట్టారు. గుంతలో బంకమట్టితో పాటు జిగురు పదార్థమైన కలబందను వేశారు. యువకులు ఉట్లమాను పైకి ఎక్కే ప్రయత్నంలో జిగురు పదార్థం వల్ల జారుతూ గుంతలోకి ఒకరిపై ఒకరు పడిపోవడాన్ని సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. సుమారుగా 30 మంది యువకులు ఉట్లమాను ఎక్కేందుకు పోటీ పడ్డారు. ఈ వేడుకలు తిలకించడానికి చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అట్టె జస్వంత్ ఉట్లమాను పైకి ఎక్కడంతో ప్రజలు చప్పట్లు కొట్టి అభినందించారు. జలధికి పోయిన మరుసటి దినం ఈ కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు వేతనం పెంచాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ధర్మవరం: మున్సిపాలిటీలోని దినసరి పారిశుధ్య కార్మికులకు రోజు వారి వేతనం పెంచాలని సీఐటీయూ మండల కన్వీనర్ జెవి.రమణ, కో కన్వీనర్ అయుబ్‌ఖాన్, మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎం.బాబు, కార్యదర్శి లక్ష్మీ ఓబులేసు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కార్మికులకు రోజువారి వేతనం రూ.400 నుంచి రూ.600కు పెంచాలన్నారు. పట్టణ జనాభా ప్రకారం 400 మంది కార్మికులు అవసరం ఉండగా కేవలం 253 మంది మాత్రమే పని చేస్తున్నారన్నారు. ఈనెల 18 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లడానికి కార్మికులకు పిలుపునిచ్చామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికుల సంఘం నాయకులతో చర్చించి కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు ఎల్.ఆదినారాయణ, హైదర్‌వలి, కార్మిక సంఘం నాయకులు వెంకటరాముడు, ప్రసాద్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాన్ని సేవగా పరిగణించండి



సైబర్ సెక్యూరిటీ బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న ఆర్డీఓ సువర్ణ, వైద్య సిబ్బంది

పుట్టపర్తి టౌన్: ప్రతి ఒక్కరూ ఉద్యోగాన్ని సేవగా పరగణించాలని ఆర్డీఓ సువర్ణ సూచించారు. గురువారం పుట్టపర్తి మండల సమాఖ్య కార్యాలయంలో చిల్డ్రన్స్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్, మిషన్ వాత్సల్య, ఆరోగ్య శాఖ సంయుక్తంగా ఎంఎల్‌హెచ్‌ఓలు, ఆశావర్కర్లకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రతి ఆరోగ్య కార్యకర్త గ్రామీణ ప్రజలకు మరింత సేవలు అందించాలన్నారు. లైంగిక పునరుత్పత్తి, ఆరోగ్యం ప్రాముఖ్యత, లైంగిక పునరుత్పత్తి హక్కులను ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు. నిర్లక్ష్యానికి గురైన బాలికల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. బాలల హక్కులు, బాల్యవివాహాల నిర్మూలన కోసం కృషి చేయాలన్నారు. క్రమం తప్పకుండా పిల్లల ఆరోగ్యం తనిఖీ చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం సైబర్ సెక్యూరిటీ బుక్‌లెట్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో జీఐఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప, సిబ్బంది మహేష్, చంద్రానాయక్, సుశీలమ్మ, రామ్మోహన్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల భూముల వెనక్కివ్వాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

ధర్మవరం రూరల్: పరిశ్రమల పేరుతో రైతుల నుంచి సేకరించిన భూములను వెనక్కు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఈ నెల 20న నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి సదస్సుకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, జిల్లా ఉపాధ్యక్షులు మారుతి తదితరులు మాట్లాడుతూ సోలార్ గ్రీన్ ఎనర్జీ పేరుతో వ్యవసాయ భూములను ప్రవేట్ కార్పొరేట్ విద్యుత్ కంపెనీలకు ఇస్తున్న ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకిస్తూ నంద్యాలలో ఏర్పాటు చేస్తున్న సదస్సుకు రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సీఐటీయూ నాయకులు ఎస్‌హెచ్ బాషా, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నామాల నాగార్జున, రైతులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



దాసరి అంకన్న



చెంచు సత్యహరిశ్చంద్రుడు

తనకల్లు: మండలంలో దొంగతనాలకు పాల్పడుతున్న గ్యాంగ్‌ను గుర్తించామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ గోపి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నంద్యాల జిల్లా బండి ఆత్మకూరుకు చెందిన దాసరి వెంకన్న అలియాస్ చెంచు వెంకన్న అతని అనుచరులు చెంచు సత్యహరిశ్చంద్రుడితో పాటు ఓ మహిళ తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నట్లు తెలియజేశారు. రహదారి పక్కన ఉన్న బంకులను పగలగొట్టి ఆహార పదార్థాలు, సిగరెట్లు, గ్యాస్ వంటి వస్తువులను దొంగలిస్తారని పేర్కొన్నారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా తన నంబర్ 9346917118కి ఫోన్ చేసి వివరాలను తెలపాలని కోరారు.

గ్రామదేవత మారెమ్మదేవికి జ్యోతుల ఉత్సవం



రొళ్ల: మండలంలోని తిరుమలదేవరపల్లిలో వెలసిన గ్రామ దేవత మారెమ్మదేవికి గ్రామస్తుల ఆధ్వర్యంలో జ్యోతుల ఉత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు నియమనిష్టలతో బియ్యం పిండితో చేసిన జ్యోతులతో గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా మోసుకెళ్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఎస్సీ కాలనీలో కూడా మారెమ్మదేవికి మహిళలు జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు.

భోజనం బాగుందా?

చిలమత్తూరు: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆర్డీఓ ఆనంద్‌కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించారు. భోజనం బాగుందా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. మెనూ తప్పక పాటించాలని ఎస్ఓ సునీతకు సూచించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు.

చాముండేశ్వరిదేవి జయంతి

మడకశిరరూరల్: మండలంలోని నీలకంఠాపురం చాముండేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో సామూహికంగా కుంకుమార్చన పూజ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



కాలనీ వాసులతో మాట్లడుతున్న సీఐ, ఎస్ఐ

ఓడీచెరువు: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని సీఐ నరేంద్ర రెడ్డి, ఎస్ఐ మల్లికార్జున రెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంలోని గుడిసెల కాలనీలో గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా పాత నేరస్తులు, అనుమానితుల నివాసాల్లో క్షుణ్ణంగా సోదాలు చేపట్టారు. అనంతరం కాలనీ వాసులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ జూదం, కోడి పందేలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. మహిళా చట్టాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, డయల్ 100 గురించి వివరించారు. పిల్లలందరినీ తప్పనిసరిగా బడికి పంపాలని సూచించారు. ఏఎస్ఐ వెంకటరాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులను గుర్తించండి



ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పిస్తున్న జిల్లా ఫ్లోరోసిస్ అధికారి ఆంజనేయులు

ధర్మవరం రూరల్: దర్శనమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఫ్లోరోసిస్‌పై ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా ఫ్లోరోసిస్ అధికారి ఆంజనేయులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఫ్లోరిసిస్ బాధితులకు చేతి కర్రలు, వాకర్స్, నడుము, మెడ బెల్టులు అందజేశామన్నారు. వైద్య సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి ఫ్లోరోసిస్ బాధితులను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ శశికళ, మెడికల్ ఆఫీసర్ పుష్పలత, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సాగైన పంటలకు ఈ- క్రాప్ బుకింగ్ చేయండి

తాడిమర్రి: మండలంలో రైతులు సాగు చేసిన పంటలన్నిటికీ ఈ–క్రాప్ బుకింగ్ చేయాలని ఏఓ శేఖర్ నాయక్ పేర్కొన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో గురువారం మండలంలోని వీఏఏలు, వీహెచ్ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేసుకోవాలని తద్వారా పెట్టుబడి తగ్గడంతోపాటు అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. అన్నదాత సుఖీభవ కోసం పెండింగ్ ఉన్న రైతులతో ఈకేవైసీ చేయించాలన్నారు. కందుల మినీకిట్స్ టార్గెట్ పూర్తి చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేసిన పొలాల్లో ప్రతి మంగళవారం పొలం పిస్తోంది కార్యక్రమం నిర్వహించాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఏఈఓ సుప్రియ, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి గ్రామ పంచాయితీలో ఖాళీగా ఉన్న 4 (పురుషుల) పారిశుధ్య కార్మికుల పోస్టులకు ఈ నెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ పోలప్ప గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెలకు రూ.6 వేలు గౌరవవేతనంతో పాటు ప్రత్యేక అలవెన్స్ రూ.1000 ఇస్తారని పేర్కొన్నారు. 18 నుంచి 55 ఏళ్ల వయసుఉన్న అభ్యర్థులు గ్రామ పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని కోరారు. వివరాలకు 9441000466 సెల్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వైఎస్ జగన్‌ను కలిసిన శాప్ మాజీ డైరెక్టర్



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఏపీ మాజీ స్పోర్ట్స్ డైరెక్టర్ ఓబిరెడ్డి

ధర్మవరం రూరల్: తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం ధర్మవరం మండలం చిగిచెర్ల గ్రామానికి చెందిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ(శాప్) డైరెక్టర్ బుచ్చిరెడ్డి గారి ఓబిరెడ్డి కలిశారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి సమన్వయంతో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని జగన్‌మోహన్‌రెడ్డి తనకు సూచించినట్లు ఆయన తెలిపారు.

రోగులకు అల్పాహారం పంపిణీ



రోగులకు అల్పాహారం అందిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రోగులు, వారి సహాయకులకు అల్పాహారాన్ని అందించారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ తిప్పేంద్రనాయక్ సహకారంతో రోగులు, వారి సహాయకులకు పాలు, బ్రెడ్డు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ప్రతి గురువారం శ్రీసత్యసాయి సేవా సమితి, సుబ్బదాసు భజన మందిరం సభ్యులు రోగులకు అల్పాహారాన్ని అందించడం అభినందనీయమని వైద్యులు తెలిపారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన



పోస్టర్లు విడుదల చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కనగానపల్లి: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ ఆంజనేయులు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో ఫ్లోరోసిస్ బాధితులకు చేతి కర్రలు, వాకర్స్, నడుము, మెడ బెల్టులు, అందజేశామని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో క్షేత్ర స్థాయిలో వెళ్లి వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఫ్లోరోసిస్ బాధితులను గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వెళ్లినప్పుడు మల్టివిటమిన్ మాత్రలు తీసుకెళ్లాలని తెలిపారు. అలాగే ఆరోగ్య అలవాట్లపై తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది శశికళ, డాక్టర్ చెన్నకేశవ రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సహకారం సంఘం వార్షిక మహాసభ

ధర్మవరం రూరల్: రావులచెరువు గ్రామంలో గురువారం భూమాత మహిళా రైతుల పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్ 7వ వార్షిక మహాసభను నిర్వహించారు. ఏఎఫ్ ఎకాలజీ కేంద్రం నుంచి మురళీకృష్ణ, ఎఫ్‌పీఓ కోఆర్డినేటర్ అబ్దుల్‌ఖాన్, ఎంటీఎల్ దస్తగిరి, ప్రతాప్, కళ్యాణ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎఫ్‌పీఓ నిర్వహణ విధానం, ఉపయోగాలు తదితర వాటిపై మహిళా రైతులతో చర్చించారు.

కేసు నమోదు

ముదిగుబ్బ: ముదిగుబ్బలో భూ వివాదంలో వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. భూమి తగాదా విషయమై మండల కేంద్రానికి చెందిన నామా రాంప్రసాద్‌పై క్రిష్టం సూర్యనారాయణ, ఆయన కుమారుడు క్రిష్టం రెడ్డిరాజు దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా రామలింగారెడ్డి

ధర్మవరం రూరల్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గ ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా వి. రామలింగారెడ్డిని నియమించారు. ఈమేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.